క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అప్రమత్తత అవసరం



క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నడిగూడెం : క్షయ వ్యాధి పట్ల అప్రమత్తత అవసరమని వైద్య ఆరోగ్య శాఖ పబ్లిక్ హెల్త్ నర్స్ కేజీయా కోరారు. గురువారం మండల పరిధిలోని ఎకలాస్‌ఖాన్ పేట తండాలో త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రెండు వారాల పాటు జ్వరం, ఆకల మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం పలువురు తండా వాసులకు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ మహేష్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, ఏఎన్ఎం జ్యోతి, ఆశా కార్యకర్తలు మంజుల, అరుణ, యాదమ్మ పాల్గొన్నారు.

దమ్ముచక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపైకి వస్తే చర్యలు



రైతుతో మాట్లాడుతున్న ఎస్ఐ నరేష్

గరిడేపల్లి : దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చలిగంటి నరేష్ హెచ్చరించారు. గురువారం దమ్ముచక్రం కలిగి ఉన్న ట్రాక్టర్ మండలంలోని కల్మలచెరువు- గరిడేపల్లి రహదారిపై రావడంతో ఆయన సంబంధిత రైతుకు అవగాహన కల్పించి మాట్లాడారు. దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపైకి రావడం వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని తెలిపారు.

జిల్లా ఉత్తమ గణిత ఉపాధ్యాయుడికి సన్మానం



శ్రీనివాసచారిని సన్మానిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : జిల్లా ఉత్తమ గణిత ఉపాధ్యాయుడిగా ఎంపికైన చింతలపాలెం జెడ్పీ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు బొల్లవరపు శ్రీనివాసచారిని ఎంఈఓ ఎస్.శ్రీనివాస్ గురువారం పాఠశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. శ్రీనివాస రామానుజన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ గణిత ఫోరం ఆయనను జిల్లా ఉత్తమ గణిత ఉపాధ్యాయుడిగా ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.నారాయణరావు, ఉస్మాన్, శ్రీనివాస్, సురేష్, పద్మావతి నిర్మలాకుమారి, ఫాతిమా, జ్యోతి, విజయ, సరిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం జయప్రద, ఉపాధ్యాయులు

హుజూర్‌నగర్ : విద్యార్థులు పోటీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తేవాలని హుజూర్‌నగర్ బాలికోన్నత పాఠశాల జీహెచ్ఎం జయప్రద అన్నారు. డివిజన్ స్థాయి గణిత పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థిని ఐల మౌనికను గురువారం పాఠశాలలో ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు జీవన, కరుణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం



ఆత్కూరి నవీన్

హుజూర్‌నగర్ : విద్యార్థి అదృశ్యమైన సంఘటన గురువారం హుజూర్‌నగర్‌లో చోటుచేసుకుంది. బాలుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన ఆత్కూరి బుచ్చయ్య కుమారుడు నవీన్ స్థానిక ప్రైవేటు స్కూల్‌లో 8వ తరగతి చదువుతూ అదే స్కూల్‌లోని హాస్టల్‌లో ఉంటున్నాడు. అతనికి కడుపులో నొప్పి వస్తుందనడంతో విద్యార్థిని తన తండ్రి బుధవారం ఇంటికి తీసుకొచ్చాడు. రాత్రి ఇంట్లోనే నిద్రపోయిన నవీన్ తెల్లవారుజామున 5 గంటల సమయంలో తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా అతని జాడ దొరకలేదు. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థి ఆచూకీ తెలిసిన వారు 9951269034, 7036850321 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని బాలుడి కుటుంబ సభ్యులు కోరారు.

మారనున్న రోడ్డు రూపురేఖలు

- డబుల్ లేన్‌గా మారబోతున్న చౌటపల్లి- మేళ్లచెరువు రోడ్డు
- రూ.10 కోట్ల నిధులు మంజూరు
- నేడు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి ఉత్తమ్



డబుల్ లేన్‌గా మారనున్న చౌటపల్లి- మేళ్లచెరువు రోడ్డు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి నుంచి మేళ్లచెరువు సింగిల్ రోడ్డుకు మహర్దశ పట్టింది. ఆరు కిలో మీటర్ల దూరం గల ఈ రోడ్డు త్వరలో డబుల్ రహదారిగా మారనుంది. ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. రోడ్డు పనులకు శుక్రవారం జిల్లా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చౌటపల్లి వద్ద శంకుస్థాపన చేయనున్నారు.

తప్పనున్న తిప్పలు..

చౌటపల్లి – మేళ్లచెరువు రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో మేళ్లచెరువు మండలానికి భారీ వాహనాలు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో ప్రస్తుతం హుజూర్‌నగర్ మీదుగా ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. డబుల్ రోడ్డు పూర్తి అయితే తిప్పలు తప్పుతాయి. మఠంపల్లి, మేళ్లచెరువు మండలాలకే కాకుండా ఆంధ్రా ప్రాంతానికి కూడా రాకపోకలు సుగమం అవుతాయి. ఈ ప్రాంతంలో ఉన్న సిమెంట్ పరిశ్రమల వాహనాలు మేళ్లచెరువు మండలం మీదుగా విజయవాడ వైపుకు వెళ్లేందుకు త్వరలో నిర్మించబోయే రహదారి ఉపయోగపడనుంది. మేళ్లచెరువు మండలానికి చెందిన పత్తి, మిర్చి వాహనాలు గుంటూరు మార్కెట్‌కు వెళ్లేందుకు మట్టపల్లి వద్ద కృష్ణానదిపై మీదుగా త్వరగా చేరుకోగలుగుతారు. కాగా, ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు తెగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. రోడ్డుకు నిధులు మంజూరు చేయడం పట్ల మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి ఉత్తమ్ చొరవతో..



చౌటపల్లి- మేళ్లచెరువు రోడ్డును డబుల్ లేన్‌గా మార్చేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. రెండు మండలాలకు వ్యాపార, వాణిజ్య సంబంధాలు మరింత మెరుగు పడేందుకు ఈ మార్గం సుగమమవుతుంది.

– కొండేటి రాంరెడ్డి, చౌటపల్లి

కష్టాలు తొలగనున్నాయి



చౌటపల్లి- మేళ్లచెరువు రోడ్డును విస్తరిస్తే మా కష్టాలు తొలగుతాయి. రోడ్డు ఇరుకుగా ఉండటంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– తమ్మర శ్రీనివాసరెడ్డి, మాజీ ఉపసర్పంచ్, చౌటపల్లి

కంపెనీకి అనుమతులు రద్దు చేయాలని ర్యాలీ



రావిపహాడ్‌లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు, కార్యకర్తలు

మోతె : రావిపహాడ్ గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండానే అక్రమంగా నిర్మించ తలపెట్టిన ఇథనాల్ కంపెనీకి అనుమతులు రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ శాఖ అధ్యక్షుడు పొడవంగి ముత్తయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం రావిపహాడ్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇథనాల్ కంపెనీ నుంచి వెలువడే విష వ్యర్థాలు ప్రమాదకరమైనవన్నారు. మోదీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో విచ్చల విడిగా ఇథనాల్ కంపెనీల నిర్మాణానికి అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఇథనాల్ కంపెనీలను నిర్మించొద్దని కోరారు. కార్యక్రమంలో లింగయ్య, నాయకులు కొత్తపల్లి ఉప్పలయ్య, ఎర్రబోయిన లింగయ్య, శ్రీనివాసరెడ్డి, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

అర్జున్ సేవలు మరువలేనివి

- జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వంగవీటి రామారావు



అర్జున్ విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కోదాడరూరల్ : దొరకుంట గ్రామ అభివృద్ధికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పాలకి అర్జున్ చేసిన సేవలు మరువలేనివని జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వంగవీటి రామారావు, టీపీసీసీ సభ్యుడు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. గురువారం దొరకుంటలో పాలకి అర్జున్ విగ్రహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా పని చేసి నిత్యం గ్రామాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. అర్జున్ విగ్రహం ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, పీఏసీఎస్ ఛైర్మన్ కొత్త రఘుపతి, కొత్త గుర్వయ్య, గద్దల వెంకటేశ్వర్లు, పత్తిపాక వెంకటేశ్వర్లు, పాలకి సురేష్, చౌడం హనుమంతరావు తదితరులు ఉన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న యరగాని నాగన్న గౌడ్

హుజూర్‌నగర్ : మంత్రి ఉత్తమ్ సహకారంతో క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని న్యూ లైఫ్ సిలోయం చర్చిలో నిర్వహించిన నియోజకవర్గ పాస్టర్స్ ఫ్యామిలీ సెమీ క్రిస్మస్ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుదన్నారు. పట్టణంలో క్రైస్తవుల శ్మశాన వాటిక కోసం మంత్రి ఉత్తమ్ రూ.75 లక్షలు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రెవరెంట్ డాక్టర్ మామిడి సంసోను, పాస్టర్లు జి.డేవిడ్ రాజు, కపానందం, టి.సుధాకర్, ఇమ్మానియేల్, దేవదానం, యాకోబు, నాగేశ్వరరావు, వివిధ మండల అధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటు చేయనియొద్దని వినతి

కోదాడరూరల్ : మండలంలోని దొరకుంట గ్రామ పంచాయతీకి చెందిన ప్రభుత్వ భూమిలో పాలకి అర్జున్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనియొద్దని పలువురు గ్రామస్తులు గురువారం ఎంపీఓకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే మరి కొందరు కూడా ఇలాగే తమ వారి విగ్రహాలు పెడతామని వస్తుంటారని దీంతో గ్రామంలో వర్గపోరుతో ఘర్షణలు చోటు చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. తమ సొంత స్థలంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. కార్యక్రమంలో ముత్తవరపు రవి, చౌడం వెంకటరామయ్య, పత్తిపాక శ్రీను, చాపల రాముడు, వెంకన్న, సైదులు, సురేష్, యాదయ్య, అప్పారావు ఉన్నారు.

శ్రీనివాస్‌యాదవ్ ఆశయాలు సాధించాలి



పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న గన్నా చంద్రశేఖర్

చిలుకూరు : సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ అమరజీవి పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ గన్నా చంద్రశేఖర్ అన్నారు. గురువారం చిలుకూరులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుట్టపాక శ్రీనివాస్‌యాదవ్ మరణంతో సీపీఐ శక్తివంతమైన నాయకుడిని కోల్పోయిందన్నారు. శ్రీనివాస్ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై ప్రశ్నించేతత్వము, సత్తా కేవలం సీపీఐకే ఉందన్నారు. ప్రజా సమస్యలపై రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి వరకు కమ్యూనిస్టులు పోరాటం చేస్తున్నారని అన్నారు. అనంతరం శ్రీనివాస్‌యాదవ్ చిత్రపటానికి ఆయన భార్య కళావతి, పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శులు సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, కాంగ్రెస్, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలుంటే తెలపాలి



నేరేడుచర్ల: అఖిలపక్ష నాయకుల సమావేశంలో ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి, తదితరులు



హుజూర్‌నగర్‌రూరల్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ లావణ్య

నేరేడుచర్ల : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నేరేడుచర్ల మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, సలహాలు, సూచనలను తెలియజేయాలని ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి అన్నారు. గురువారం నేరేడుచర్ల మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై అఖిల పక్ష పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాలు అసౌకర్యంగా ఉంటే మండల పరిషత్ కార్యాలయంలో తెలియజేయాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి హరిసింగ్, రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు ఉన్నారు.

ఎన్నికలపై అవగాహన ఉండాలి



చిలుకూరు : రాజకీయ నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ గిరిబాబు

హుజూర్‌నగర్‌రూరల్ : ఎన్నికలపై రాజకీయ నాయకులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పిండిప్రోలు లావణ్య అన్నారు. గురువారం హుజూర్‌నగర్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాపై రాజకీయ పార్టీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ నబీ, టీడీపీ నాయకుడు వంశీ తదితరులు పాల్గొన్నారు.

158 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

చిలుకూరు : మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు 158 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ గిరిబాబు తెలిపారు. గురువారం చిలుకూరు మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల సవరణపై రాజకీయ నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో తుది పోలింగ్ కేంద్రాల జాబితాను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జగదీష్, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



చిలుకూరు : క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న రామ్‌చందర్‌రావు



మోతె : నామవరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆంజనేయులు

చిలుకూరు : విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా క్రీడల విభాగం అధికారి, మండల ప్రత్యేక అధికారి రామ్‌చందర్‌రావు అన్నారు. చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఆయన ప్రశంసాపత్రాలు అందజేసి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, పీడీలు సీతారాంరెడ్డి, బ్రహ్మారెడ్డి, రేణుక, ప్రకాశ్, రాము, శోభన్‌బాబు, మట్టయ్య, రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మోతె : క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం లభిస్తుందని మోతె ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. గురువారం మోతె మండలంలోని నామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంఘమిత్ర, ఎంఈఓ గోపాల్‌రావు, హెచ్ఎంలు బీఎల్ఎన్ చారి, జనార్దన్, పీడీలు కోటేశ్వరరావు, రేణుక, నాగేశ్వరరావు, మల్లీశ్వరి, గురులక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : క్రీడాకారులతో అధికారులు, పీడీలు, పీఈటీలు

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. చివరి రోజు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. 64 మంది క్రీడాకారులు వాలీబాల్, కబడ్డీ, లాంగ్ జంప్ తదితర క్రీడా పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అంతిరెడ్డి, ఎంపీడీఓ భూపాల్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, నాగిరెడ్డి, ఆర్గనైజర్లు, పీడీలు, పీటీలు క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గొట్టే నాగరాజు

హుజూర్‌నగర్ : అర్హులైన ప్రైవేటు టీచర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టే నాగరాజుయాదవ్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రైవేటు టీచర్లందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని గతంలో మంత్రి ఉత్తమ్‌తో పాటు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న సర్వేలో అర్హులైన ప్రైవేటు టీచర్లకు ఇళ్లు మంజూరు చేసి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు టీచర్లు జి.నాగమణి, ఎం.నాగరాజు, సీహెచ్.శ్రీనివాసచారి, జి.ఆంజనేయులు, ఏ.విజయ్‌కుమార్, సునీత, రఘూన్నీ, హేమలత, షబానా, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చిమిర్యాల వద్ద ఉలకవాగు ఆక్రమణ



వాగులో మట్టి పోసి చదును చేసిన ఆక్రమణదారులు

కోదాడరూరల్ : మండలంలోని చిమిర్యాల మీదుగా ప్రవహిస్తున్న ఉలక వాగు ఆక్రమణకు గురవుతోంది. కోదాడ పెద్ద చెరువు నుంచి వచ్చే ఈ వాగు తమ్మర, అల్వాలపురం, బండపాలెం, దొరకుంట గ్రామాల శివారు నుంచి ప్రవహిస్తుంది. చిమిర్యాల బ్రిడ్జి వద్ద వాగు పక్కన పొలాలు ఉన్న కొందరు రైతులు మట్టి పోసి చదును చేసుకుంటున్నారని, దీంతో వాగులో నీటి ఉధృతి ఎక్కువైనప్పుడు వరద గ్రామం మీదకు వస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు స్పందించి వాగు అక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరుతున్నారు. తహసీల్దార్, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా చేపట్టాలి



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు నవీన్‌కుమార్

నేరేడుచర్ల : ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక సర్వే పారదర్శకంగా చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ హుజూర్‌నగర్ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్‌కుమార్ కోరారు. నేరేడుచర్ల మండలం దిర్శించర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకున్న వారిని గురువారం ఆయన కలిసి మాట్లాడారు. ఖాళీ స్థలం ఉండి అంగవైకల్యం ఉన్నవారికి, తెలంగాణ మలిదశ ఉద్యమకారులు, ఒంటరి మహిళలకు ముందుగా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులను ఎంపిక చేయాలన్నారు. లబ్ధిదారులకు రేషన్ కార్డులు మంజూరు చేసి సన్న బియ్యం పంపిణీ చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఇంజమూరి రాజేష్, రాంబాబు, రమేష్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తుంగతుర్తి : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఓరుగంటి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, వెంకటనారాయణ, రిటైర్డ్ టీచర్ పాలవరపు సంతోష్ తదితరులు ఉన్నారు.

ధనుర్మాసోత్సవాలకు రామాలయం ముస్తాబు



ముస్తాబైన శ్రీకోదండ రామాలయం

నేరేడుచర్ల : పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. 16వ తేదీ నుంచి జనవరి 2 వరకు ప్రతి రోజు ఉదయం తిరుప్పవై సేవా కాలం, జనవరి 3 నుంచి ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 11న కుడారై, 13న భోగితో పాటు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను గురువారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. కట్టకమ్ముగూడెం రోడ్డులో గల ధరావత్ శ్రీనివాస్ నివాసంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారంతో ఎస్ఐ ఏ.రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న వేముల నాగేశ్వర్‌రావు, పిడమర్తి రవీందర్, ఊదర బాబు, బచ్చలకూరి వెంకటేశ్వర్లు, గుంజ పిచ్చయ్యలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.26,680 నగదు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

భానుపురి (సూర్యాపేట) : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. ఈ దీక్షకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి మద్దతు తెలిపారు. తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు రాంబాబునాయక్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న పచ్చిపాల రామకృష్ణ, నిర్వాహకులు

కోదాడరూరల్ : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బీసీ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ అన్నారు. కోదాడ పట్టణ పరిధిలోని గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో గురువారం ఆయన అన్నదానం ఏర్పాటు చేసి ప్రారంభించారు. గాలి శ్రీనివాస్‌నాయుడు, మాలధారులు ఉన్నారు.

సాయి మందిరంలో అన్నదానం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో గురువారం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రేపాల పురుషోత్తం, కార్యదర్శి మొరిశెట్టి రమణ, సభ్యులు ఉపేందర్, భక్తులు పాల్గొన్నారు.